

## చెరువులకు జీవం పోద్దాం

### ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, జూలై 9 : నగరంలో అన్యాక్రాంతమైన చెరువుల పునరుద్ధరణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అధికారులకు పిలుపునిచ్చారు. ట్రై సిటీ పరిధిలోని రెవెన్యూ, జి.ఐ.ఎస్ హబ్ టీమ్స్, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులతో మంగళవారం బుద్ధ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న చెరువులు, వాటి బఫర్ జోన్ల ఫుల్‌ట్యాంక్ లెవల్ పరిధితో పాటు చెరువుల పునరుద్ధరణ, వాటి రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 10 జూలై 2024 HYDERABAD









గచ్చిబౌలి చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి, జడ్సీ ఉపేందర్‌రెడ్డి

# పబ్లిక్ టాయిలెట్లన్నింటినీ వినియోగంలోకి తేవాలి

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

### అధికారులకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పబ్లిక్ టాయిలెట్లన్నంటినీ వినియోగంలోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులకు సూచించారు. మంగళవారం బుద్ధ భవన్‌లో రెవెన్యూ, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్, ఫైనాన్స్ విభాగాల అధికారులతో కమిషనర్ ఆయా విభాగాల అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జీహెచ్ఎంసీలో చేపట్టిన మౌలిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదాయం పెంపునకు చేపట్టిన జీఏఎస్ సర్వేను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. నాలాల వరద నీరు నిలువకుండా ఫ్లోటింగ్ మెటీరియల్‌ను వెనువెంటనే తొలగించే విషయాలపై చర్చించారు. స్వచ్ఛ ఆటోలు నిర్దేశించిన ప్రకారంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్, గీత రాధిక, ట్యాక్స్ వాల్యుయేషన్ అధికారి మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయండి

మియాపూర్: ఎస్ఆర్‌డీపీ కింద గచ్చిబౌలి కూడలిలో చేపడుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఆస్తుల సేకరణ సహా ఇతర ఏ ఇబ్బందులున్నా పరిష్కారానికి శీఘ్రంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు సీఈ దేవానంద్ సహా ఇతర అధికారులతో కలిసి ఆమె గచ్చిబౌలి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గుల్మొహర్ పార్కు, ట్రిపుల్ ఐటీ కూడళ్లతో పాటు లింగంపల్లి ఆర్‌యూబీ, హెచ్‌సీయూ బస్ డిపో ఎదుట మసీదు బండ ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమ్రపాలి మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యల్లేకుండా ఫ్రీ లెఫ్ట్‌లను మరింతగా ఏర్పాటు చేయాలని, కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. లింగంపల్లి ఆర్‌యూబీ వద్ద శాశ్వత పరిష్కారానికి గాను ఆర్‌వోబీ నిర్మాణానికి తగు ప్రతిపాదనలను రూపొందించాలని తెలిపారు. మసీదు బండ నుంచి గచ్చిబౌలి వరకు రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను త్వరిత గతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కీలకమైన కూడళ్లలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో డీసీ రజనీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.





ఆందోళనలతో అట్టుడికిపోయిన ఉస్మానియా యూనివర్సిటీ

# రగులుతున్న ఉస్మానియా

## డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలతో ఉద్రిక్తంగా ఓయూ



విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

### రెండో రోజూ ఆరని నిరసన సెగ

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలి.. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి.. అనే ప్రధాన డిమాండ్లతో డీఎస్సీ అభ్యర్థులు సాగిస్తున్న నిరసన సెగ రెండో రోజూ కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు పట్టువీడని విక్రమార్కుల్లా నిరుద్యోగులు ఆందోళన బాట వీడలేదు. సోమవారం ఉదయం లక్డీకాపూల్‌లోని విద్యాశాఖ డైరెక్టరేట్ వేదికగా నిరుద్యోగులు మొదలుపెట్టిన నిరసన రాత్రి... పగలు అనే తేడా లేకుండా సాగింది. సోమవారం రాత్రి పేట్లబురుజులోని సిటీ ఆర్మ్ రిజర్వుడ్ హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అభ్యర్థులు అర్ధరాత్రి ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకున్నారు. ముఖ్యంగా మహిళా అభ్యర్థులు సైతం మంచినీళ్లు, తిండి లేకుండా... పది కిలోమీటర్లకు పైగా నడిచి మరీ క్యాంపస్ చేరుకున్నారు. కొందరు విద్యార్థినులు కాళ్లకు చెప్పులు లేకుండానే నగర రోడ్లపై నడుచుకుంటూ ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. అక్కడ రాత్రంతా తమ నిరసనను కొనసాగించారు. అనంతరం మంగళవారం ఉదయం తిరిగి మళ్లీ పోలీసులు యూనివర్సిటీకి వచ్చి నిరుద్యోగులను అరెస్టు చేశారు. ఇలా దాదాపు 36 గంటల పాటు నిద్రాహారాలకు దూరమై... పోలీసుల అరెస్టులతో నీరసించిపోయారు. కాగా మంగళవారం ఉదయం ఓయూ క్యాంపస్‌లో వందలాది మంది పోలీసులు డీఎస్సీ అభ్యర్థుల కోసం జల్లెడ పట్టి అరెస్టు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# చిన్నారుల పాలిట డేంజర్ డాగ్స్

### ఏటా రూ.11.5 కోట్లు ఖర్చు చేస్తున్నా తప్పని కుక్కకాట్లు

### వీధి కుక్కల బెడదపై రోజూ జీహెచ్ఎంసీ 98కి పైగా ఫిర్యాదులు

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): రానురానూ వీధికుక్కలు చిన్నారుల పాలిట మృత్యుమృగాలుగా మారుతున్నాయి. రోడ్లపై ఒంటరిగా వెళ్తున్న వారిపై కూడా మందగా దాడి చేస్తున్నాయి. ఫలితంగా రోజుకు సరాసరి 100 వరకు కుక్కకాట్లు జరుగుతున్నట్లు జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి.

### కనబడితే చాలు.. కరిచిపడేసి

జూన్ 6వ తేదీన మియాపూర్‌లో ఆరేండ్ల సాత్విక్‌ను వీధి కుక్కలు చంపేశాయి.. మొన్నటికిమొన్న చిత్రపురి కాలనీలో వాకింగ్ చేస్తున్న గృహిణిపై కుక్కల మంద దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. అంబర్‌పేటలోని ఎరుకల బస్తీలో వీధి కుక్కలు స్కూల్‌కు వెళ్లే చిన్నారులపై దాడిచేయగా ఓ బాలుడు చనిపోయాడు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐదేండ్ల దీపాలి ఆడుకుంటుండగా కుక్కలు దాడిచేశాయి. ఆ చిన్నారి చికిత్స పొందుతూ చనిపోయింది. ఇలా.. వీధి కుక్కలు చిన్నారుల పాలిట మృత్యుమృగాలుగా మారుతున్నాయి. ఒంటరిగా వెళుతున్న వారిని లక్ష్యంగా చేసుకొని మందకు మంద కలిసి దాడి చేస్తున్నాయి. పగబట్టినట్లే ప్రవరిస్తూ కండలు పీకేస్తూ ప్రాణాలను తీస్తున్నాయి. వీధి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలంటూ జీహెచ్ఎంసీకి ప్రతిరోజూ 98కి పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. మరోవైపు వీధి కుక్కల నియంత్రణను జీహెచ్ఎంసీ గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నది. ప్రధానంగా వీధికుక్కలకు ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్స్) ఆపరేషన్లేగాక, రేబిస్ నివారణ టీకాలను వేయడంలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వహిస్తున్నది. నగరంలో 5 చోట్ల జంతు సంరక్షణ కేంద్రాలు ఉండగా.. ప్రతి సంవత్సరానికిగానూ రూ.11.5 కోట్లు ఖర్చు చేస్తున్నా వీధి కుక్కల బెడద తగ్గడం లేదు. వీధి కుక్కల నియంత్రణకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసినా ఫలితం అంతంత మాత్రమే ఉన్నది.

### స్టెరిలైజ్ చేస్తున్నా..

గడిచిన పదేళ్ల కాలంలో జీహెచ్ఎంసీ పరిధిలో 8 మంది చిన్నారులు వీధి కుక్కల బారిన పడి చనిపోయినట్లు అధికారులు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ నివేదిక ప్రకారం వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు, పిల్లులు, కోతులు 3,36,767 మందిని కరిచినట్టు అధికారులు తెలిపారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వీధి కుక్కల బెడదకు సంబంధించి 3,60,469 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. అంటే సరాసరి రోజుకు 98 మంది కుక్కల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గడిచిన పదేళ్ల కాలంలో 721,291 వీధి కుక్కలకు స్టెరిలైజ్ చేసి టీకా వేసినట్లు అధికారులు తెలిపారు. వీధి కుక్కలకు సంతాప నిరోధక శస్త్రచికిత్సలు, వ్యాక్సిన్లు చేశామని చెబుతున్నా పెరుగుతున్న కుక్క కాట్లు అధికారుల నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతున్నాయి.

# కమనీయం ఎల్లమ్మ కల్యాణం





బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం

**పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం, సురేఖ**

**వేలాదిగా హాజరైన భక్తులు**

**భారీగా తరలివచ్చిన వీవీఐపీలు**

అమీర్‌పేట్, జూలై 9 : బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వేదికపై అమ్మవారు ఆసీనులు కాగా అశేష సంఖ్యలో భక్తులు తిలకిస్తుండగా ఎల్లమ్మ వారు.. జమదగ్ని మహర్షిని (త్రిశూల రూపం) వివాహమాడారు. ఈ వేడుకకు పెద్ద ఎత్తున నగరవాసులు హాజరయ్యారు. ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ వేద పండితులు అమ్మవారి కల్యాణ ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టు వివరిస్తూ కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణోత్సవానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, శ్రీగణేశ్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి శరత్, దేవాదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ కేతినేని సరళ సహ వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అధికార, అనధికార ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల ఆకలి తీర్చేందుకు బల్కంపేట వాసులు అడుగడుగునా అన్నప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### నిర్వహణ లోపంతో

ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఈ సారి నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనబడింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, వీవీఐపీలకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. క్యూలైన్లలో విపరీతమైన రద్దీ పెరిగిపోవడంతో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మికి స్వాగతం పలికేందుకు అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. మరోవైపు వీరిద్దరిని పోలీసులు లోపలికి తీసుకు వెళ్లేందుకు యత్నించగా ప్రత్యేక టికెట్లు ఉన్న భక్తులు కూడా దూసుకురావడంతో పొన్నం కుదుపునకు గురికాగా మేయర్ విజయలక్ష్మి కిందపడిపోయారు. కాగా కలెక్టర్ అనుదీప్ వీరిని బుజ్జగించి శాంతింపజేశారు. కాగా గత దశాబ్ద కాలంగా ఎలాంటి చెదురుమదురు ఘటనలు లేకుండా సాగుతూ వచ్చిన ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఈ సారి మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ పర్యవేక్షణ లేకపోవడంతో ఆ లోటు స్పష్టంగా కనబడింది.



బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మేయర్ విజయలక్ష్మి తదితరులు



## ప్రశాంత పాత్రోకు జియోసైన్స్ పురస్కారం

ఉప్పల్, జూలై 9 : ఉప్పల్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)లో ముఖ్యశాస్త్రవేత్తగా పనిచేస్తున్న డా.బి.ప్రశాంత కె.పాత్రో 2023వ సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన జాతీయ భూవిజ్ఞాన పురస్కారానికి ఎంపికయ్యారు. భూభౌతిక శాస్త్రం, అప్లైడ్ భూభౌతిక శాస్త్ర రంగాలలో ఆయన చేసిన అసాధారణమైన కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఈ జియోసైన్స్ అవార్డును అందించింది. ఇటీవల డాక్టర్ పాత్రో పలు పరిశోధనలు చేశారు. మాగ్నెటోటెల్లూరిక్ రెస్పాన్స్ ఫంక్షన్‌లను మెరుగ్గా అర్థం చేసుకోవడానికి కొత్త 3-డీ ఇన్వర్షన్ సాంకేతికతలను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఈ మేరకు పలువురు శాస్త్రవేత్తలు పాత్రోను అభినందించారు.

## తెలంగాణలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్

సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) పేరుతో ఒక వేదికను ఏర్పాటు చేసిందని ఐటీ,పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తెలిపారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసిసోసియేషన్ సహకారంతో ఈనెల 16న టీ హబ్‌లో ఐటీ కంపెనీల మానవవనరుల విభాగం డైరెక్టర్లు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

## బోడుప్పల్ మేయర్ ఎన్నికకు షెడ్యూలు విడుదల

బోడుప్పల్, జూలై 9: గత నెల 29న బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవి గౌడ్‌లపై స్థానిక కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గిన నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నియమితులైన ప్రొసీడింగ్ అధికారిచే మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగుతుందని అధికారులు వెల్లడించారు.